ఆదిలాబాద్ జిల్లాలో ఎద్దులకు గోనె సంచులను కప్పిన రైతు

తెలంగాణకు 'ఫెంగల్' ముప్పు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తేతెలంగాణ): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారిందని భారత వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. 24 గంటల్లో తుఫానుగా ఏర్పడబోతున్నదని హెచ్చరించారు. ఈ తుఫానుకు 'ఫెంగల్'గా నామకరణం చేశారు. మరో రెండు రోజుల్లో వాయుగుండంగా మారి తమిళనాడు-శ్రీలంక తీరాల వైపు వెళ్లొచ్చునని తెలిపారు. ఫెంగల్ తుఫాను ప్రభావంతో దక్షిణ తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. నాలుగైదు రోజులపాటు విపరీతమైన చలిగాలులు వీచనున్నాయని తెలిపారు.

ఆదిలాబాద్‌లో అత్యల్పం..

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రజలు గజగజ వణుకుతున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కొన్నిచోట్ల కనిష్ఠ ఉష్ణోగ్రతలు 8 డిగ్రీలకు చేరుకున్నాయి. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో రికార్డు స్థాయిలో అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఇథనాల్ ఫ్యాక్టరీతో మాకు సంబంధం లేదు

మాజీమంత్రి తలసాని

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీతో తమ కుటుంబానికి సంబంధం లేదని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ స్పష్టంచేశారు. కంపెనీలో తన కుమారుడు సాయి కిరణ్‌కిరణ్ ఓ డైరెక్టర్‌గా ఉన్నారన్న కాంగ్రెస్ నేతల ఆరోపణలపై మంత్రి స్పందించారు. కాంగ్రెస్ ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఆయన తేల్చిచెప్పారు. కంపెనీలో తమకు భాగస్వామ్యం ఉన్నట్టు రుజువు చేస్తే ఆ కంపెనీని అప్పగించేందుకు సిద్ధమని సవాల్ చేశారు.

రైతు విజయోత్సవాలు ఎందుకు?

- 563 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినందుకా?
- రైతు డిక్లరేషన్ 9 హామీల్లో ఒక్కటీ నెరవేర్చనందుకా?
- రుణమాఫీ, రైతుభరోసా, మద్దతు ధర ఇవ్వనందుకా?
- అకాల వర్షాల పంటనష్టం 11,700 కోట్లు ఇవ్వనందుకా?
- రైతులకు బాకీ పడ్డ 40,800 కోట్ల తోపాటు యాసంగి రైతుభరోసా ఇచ్చి విజయోత్సవాలు చేసుకోవాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రైతులను ఏమి ఉద్ధరించారని రైతు విజయోత్సవాలు జరుపుతున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏడాదిగా రైతులను దగా చేసి, రైతు పండుగ పేరిట మూడు రోజులు విజయోత్సవాలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు బాకీ పడ్డ రూ.40,800 కోట్ల తోపాటు ఈ యాసంగి సీజన్‌కు ఇవ్వాల్సిన రైతుభరోసా కూడా వెంటనే విడుదల చేసి పండుగ చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 'రేవంత్‌రెడ్డీ.. ఏడాది పాలనలో రైతులను విజయవంతంగా దగా చేసినందుకు రైతు పండుగ అంటూ మూడు రోజుల విజయోత్సవాలు చేస్తున్నవా? వరంగల్ రైతు డిక్లరేషన్‌లోని తొమ్మిది హామీల్లో ఒక్కటీ అమలుచేయనందుకు పండుగ చేస్తున్నవా? రుణమాఫీ ఎగ్గొట్టి, రైతుభరోసా బోగస్ చేసి, కనీస మద్దతు ధరకు పంట కొనుగోలు చేయకుండా రైతులను ఏడిపించినందుకు చేస్తున్నవా? మీ ఏడాది దుర్మార్గ పాలనలో 563 మంది రైతులు ప్రాణాలు కోల్పోయినందుకు పండుగ చేస్తున్నవా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.

రైతులను మభ్యపెట్టి అధికారంలోకి..

రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి, వారిని నిండా ముంచారని హరీశ్‌రావు దుయ్యబట్టారు. 'రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు చేసిందేమిటి? కేసీఆర్ ఇచ్చిన రైతుబంధు పథకానికి ఎగనామం పెట్టింది. నూటొక్క దేవుళ్ల మీద ఒట్టు పెట్టి రుణమాఫీ చేస్తానని మోసం చేశారు. సగం మందికి మొండిచెయ్యి చూపారు. 24 గంటల నాణ్యమైన కరెంటు అందించలేక చేతులెత్తేశారు. పంటలకు మద్దతు ధర లేదు. అన్ని పంటలకు బోనస్ అసలే లేదు. కొనుగోలు కేంద్రాలు లేవు. కౌలురైతులకు, రైతుకూలీలకు ఇస్తానన్న భరోసాకు దిక్కులేదు. రైతులకు మీరు చేసిన మోసాన్ని కప్పిపుచ్చుకునేందుకు రైతు పండుగ నిర్వహించడం సిగ్గుచేటు. పైగా, ఏడాది పాలనలో రైతు సంక్షేమం కోసం రూ.54,280 కోట్లు ఖర్చు చేసినట్టు ప్రచారం చేసుకోవడం నవ్విపోదురుగాక నాకేంటి సిగ్గు అన్నట్టుగా ఉన్నది. రైతుబీమా, ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్ల కోసం మీరు ఖర్చు చేసినట్టు చెప్పిన రూ.27,486 కోట్లు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చేసింది. ఏ ప్రభుత్వం ఉన్నా చేయాల్సిందే. కానీ, కొత్తగా తామేదో రైతులకు చేసినట్టు డబ్బా కొట్టుకోవడం రైతులను మరోసారి మోసం చేయడమే. ఇదేనా కాంగ్రెస్ మార్కు మార్పు?' అని హరీశ్‌రావు నిలదీశారు.

ఏడాదిలో రైతులకు 40,800 కోట్లు బాకీ

కాంగ్రెస్ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రకారం తెలంగాణ రైతులకు రేవంత్‌రెడ్డి సర్కార్ రూ.40,800 కోట్లు బాకీ పడిందని హరీశ్‌రావు వివరించారు. రుణమాఫీ కింద దాదాపు రూ.14,000 కోట్లు, వానకాలం రైతుబంధు కింద రూ.7,500 కోట్లు, కౌలు రైతులకు రూ.3,000 కోట్లు, రైతుకూలీలకు రూ.1,600 కోట్లు, అన్ని పంటలకు బోనస్ కింద సుమారు రూ.3,000 కోట్లు, అకాల వర్షాలకు పంట నష్టం కింద సుమారు రూ.11,700 కోట్లు (కేంద్రానికి రాష్ట్రం పంపిన రిపోర్టు). ఇలా ఏడాది కాలంలో మొత్తం రూ.40,800 కోట్లు రైతులకు బాకీ పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

లగచర్లలోనూ లెంపలేసుకోండి

- రైతుల నుంచి భూసేకరణను నిలిపివేయండి
- దిలావర్‌పూర్ తరహాలో లగచర్లలో దిగిరావాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగివచ్చిన సీఎం రేవంత్ లగచర్ల విషయంలోనూ లెంపలేసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లగచర్లలో అల్లుడు, అదానీ కోసం ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో పెడుతున్న ఫార్మా, సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతిపాదనలు వెనక్కి తీసుకోవాలని స్పష్టంచేశారు. అమాయక గిరిజనుల భూములను దొంగచాటుగా బలవంతంగా లాక్కునే కుట్రలకు ఇప్పటికైనా తెరదించి, ఆయా ప్రాంతాల్లో శాంతిని నెలకొల్పాలని ఆయన ఎక్స్ వేదికగా సూచించారు. ఢిల్లీలో రైతుల పోరాటంతో ప్రధాని కూడా వెనక్కి తగ్గిన చరిత్రను చూశామని గుర్తుచేశారు. లగచర్లలో లడాయికి, దిలావర్‌పూర్‌లో ఇథనాల్ మంటలకు రేవంత్‌రెడ్డి అనాలోచిత నిర్ణయాలు, మొండి వైఖరే కారణమని విమర్శించారు. సీఎం తీరుతో ఏ జిల్లాలో... ఏ పచ్చని పంట పొలాల్లో ఎలాంటి బాంబు పేలుతుందోననే రైతులందరిలోనూ నెలకొన్నదని పేర్కొన్నారు. లగచర్ల రైతుల సమరానికి రేవంత్‌రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టాలని డిమాండ్ చేశారు.

ఎవరనుకున్నరు ఇట్లవుతదని!

రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ప్రజాకవి కాళోజీ కవితలను ఉటంకిస్తూ కేటీఆర్ ఎక్స్‌వేదికగా ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రం సంధించారు. "తెలంగాణాలో ఫించన్ల కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరనుకున్నరు? ఠంచన్‌గా అకౌంట్లో పడే పైసలు ఆగిపోతాయని ఎవరనుకున్నరు? మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి... కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని ఎవరనుకున్నరు? మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమేలేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే మార్పు వస్తుందని ఎవరనుకున్నరు? అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నరు? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నరు?" అంటూ విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ కరకు గుండె కరిగేదెన్నడు...?

రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులకు కాంగ్రెస్ కరకు గుండె కరిగేదెన్నడు? రైతుల కష్టాలు తీరేదెన్నడు? అని కేటీఆర్ ప్రశ్నించారు. యాసంగి పోయి వానాకాలం, వానాకాలం పోయి యాసంగి వచ్చినా రైతుభరోసాపై సర్కార్‌కు స్పష్టత లేదని మండిపడ్డారు. గల్లా ఎగురేసిన రైతు నేల చూపులు చూస్తున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. రెండు విడతలుగా 20వేల కోట్ల రైతుభరోసా ఎగ్గొట్టి, రూ.31 వేల కోట్ల రుణమాఫీ అని ప్రకటించి, 17 వేల కోట్లతో సరిపెట్టి సర్కారు చేతులు దులుపుకుందని విమర్శించారు. రైతుభరోసా కోసం రైతులు, కౌలు రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

చిన్న కాళేశ్వరంలో శ్రీధర్‌బాబు అవినీతి కుట్ర

- రూ. 571 కోట్లు ఎవరికిస్తున్నరు?
- ప్రాజెక్టుపై ఒక్క రివ్యూ చేయలేదు
- వత్తాసు పలుకుతున్న కొన్ని పత్రికలు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.571 కోట్లు ఎందుకు ఇస్తున్నది.. ఎవరికిస్తున్నది? అని బీఆర్ఎస్ సీనియర్‌నేత, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ప్రశ్నించారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.571 కోట్లు కాగా, 75% పనులు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని చెప్పారు. కొత్తగా రూ.571 కోట్లు ఇస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ ప్రకటించడం వెనుక ఉద్దేశం ఏమిటని నిలదీశారు. ప్రాజెక్టు వ్యయం పెంచారా? 25% పనులకు రూ.571 కోట్లు కేటాయిస్తున్నారా? అని నిలదీశారు. వివరాలను వెల్లడించకుండా కొన్ని పత్రికలు, చానళ్లు కాంగ్రెస్ నేతలు చెప్పినట్టు రాస్తున్నాయని, మంత్రి శ్రీధర్‌బాబుకు వత్తాసు పలుకుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం పుట్ట మధు మీడియాతో మాట్లాడుతూ " చిన్న కాళేశ్వరం ప్రాజెక్టును తక్షణం పూర్తి చేయాల్సిన (ఫాస్టాగ్) జాబితాలో చేర్చినట్టు ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎస్ఈని నియమించలేదు. ఫాస్టాగ్ ప్రాజెక్టు అంటే ప్రత్యేక ఏజెన్సీ ఉండాలి. కానీ ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులు ఎవరూ లేరు. ఒక్క ఎకరం భూమికూడా సేకరించలేదు. ప్రాజెక్టుపై అధికారులు ఇప్పటి వరకు ఒక్క సమీక్ష కూడా చేయలేదు. ప్రాజెక్టు ముసుగులో జేబులు నింపుకోవడానికి శ్రీధర్‌బాబు ప్రయత్నిస్తున్నారు." అని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శంకర్‌లాల్, పుదరి సత్యనారాయణగౌడ్, లక్కిరెడ్డి, నర్సింహారెడ్డి, రామెళ్ల కిరణ్ పాల్గొన్నారు.

లగచర్ల నిరసన హిమాలయాలకు చేరింది. లగచర్ల బాధితులకు మద్దతు తెలుపుతూ హిమాలయ శిఖరాన 'న్యాయం చేయండి' అంటూ పలువురు ప్లకార్డులు ప్రదర్శించారు. ఇందుకు సంబంధించిన చిత్రాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఇండస్ట్రియల్ కారిడార్‌కు మా భూములివ్వం

- తహసీల్దార్‌ను గ్రామ శివారులోనే అడ్డగించిన రైతులు
- అధికారులను వెనక్కి పంపించిన రామగిరి గ్రామస్తులు

రామగిరి, నవంబర్ 27: సర్వే చేయవద్దని, ఇండస్ట్రియల్ కారిడార్‌కు తమ భూములు ఇచ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. గ్రామానికి సర్వే కోసం వస్తున్న తహసీల్దార్, సిబ్బందిని గ్రామశివారులోనే అడ్డగించి వెనక్కి పంపించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ పంచాయతీ పరిధి మేడిపల్లి శివారులో అధికారులు భూములు సేకరించేందుకు సిద్ధమయ్యారు. మొత్తం 178.22 ఎకరాల పట్టా, అసైన్డ్ భూమి అవసరమని నిర్ణయించి, సర్వే నంబర్ల వారీగా తీసుకుంటున్నట్టు రత్నాపూర్ జీపీ ఆఫీస్ బోర్డులో అంటించారు. విషయం తెలియడంతో ఇక్కడి రైతులు ఆగ్రహించారు. బుధవారం అధికారులు వస్తున్నారని తెలిసి మేడిపల్లి శివారులో బైఠాయించారు. రామగిరి తహసీల్దార్ రామచందర్ రావు తన సిబ్బందితో కలిసి సర్వే చేసేందుకు రాగా అడ్డుకున్నారు. ఎందుకు సర్వే చేస్తున్నారు? ఎవరిని అడిగి సర్వే చేస్తున్నారని ప్రశ్నించారు.

- కేసీఆర్ వైపే జనం చూపు: నిరంజన్‌రెడ్డి

వనపర్తి, నవంబర్ 27(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు మళ్లీ ఉద్యమ నేత, మాజీ సీఎం కేసీఆర్ వైపు ఆశతో చూస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేపట్టిన దీక్ష స్ఫూర్తితో పార్టీ శ్రేణులు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. వనపర్తి ఇన్‌చార్జి ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటి ఉద్యమ నేత కేసీఆర్ వల్లే తెలంగాణ ఆవిర్భవించిందని అన్నారు.

- మలిదశ ఉద్యమానికి కేసీఆర్ దీక్షే పునాది: ఆర్ఎస్‌పీ

బాన్సువాడ రూరల్, నవంబర్ 27: కేసీఆర్ ఆమరణ దీక్ష తెలంగాణ మలిదశ ఉద్యమానికి పునాది అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బాన్సువాడలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చేపట్టిన దీక్షతో యావత్ తెలంగాణ కదిలి వచ్చిందని అన్నారు.

- కేసీఆర్ ఆమరణ దీక్షతోనే తెలంగాణ: ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నారాయణపేటరూరల్, నవంబర్ 27 : కేసీఆర్ చేసిన ఆమరణ దీక్షతోనే తెలంగాణ ఏర్పడిందని ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం నారాయణపేటలో నిర్వహించిన దీక్షా దివస్ సన్నాహక సమావేశంలో కోటిరెడ్డి మాట్లాడుతూ.. నాడు కేసీఆర్ చేపట్టిన దీక్ష తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. 29న జిల్లావ్యాప్తంగా నిర్వహించే దీక్షాదివస్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

- కేసీఆర్ పోరాటం భావితరాలకు స్ఫూర్తి: విద్యాసాగర్‌రావు

జగిత్యాల టౌన్, నవంబర్ 27: కేసీఆర్ చేసిన దీక్షతో తెలంగాణ కల సాకారమైందని, ఆయన చేసిన అలుపెరుగని పోరాటం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు కొనియాడారు. 29న దీక్షా దివస్‌ను పురస్కరించుకొని బుధవారం జగిత్యాలలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 29న జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగే దీక్షా దివస్ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు పాల్గొన్నారు.

సర్కారుపై గెలిచిన దిలావర్‌పూర్ రైతు

మొదటిపేజీ తరువాయి...

పంట కూడా తీయలేక ఆగమైపోతం. మా భూములు, నీళ్లు, గాలి అన్నీ కలుషితమైపోయి.. భూములు పడావు పడి రోడ్డు మీద పడాల్సి వస్తది. అందుకే మాకు ఇథనాల్ పరిశ్రమ వద్దు' అంటూ ఏడాది నుంచి దిలావర్‌పూర్, గుండంపల్లి, బన్సపల్లి, సముందర్‌పల్లి గ్రామాల రైతులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పనులు వేగవంతం కావడంతో ఆందోళన చెందిన రైతులు, స్థానికులు ఈ ఏడాది జనవరి 3న ఫ్యాక్టరీని ముట్టడించారు. అయినా ప్రభుత్వం స్పందించకపోవడం, యాజమాన్యం పనులు చేసుకుంటూపోవడంతో 4 నెలల నుంచి పోరాటాన్ని తీవ్రతరం చేశారు. దిలావర్‌పూర్‌కు చెందిన యువకులు 127 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోనూ టెంట్లు వేసి నిరసన తెలుపుతున్నారు.

కేసులు పెట్టి వేధింపులు..

ఫ్యాక్టరీ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపుతూ దీక్షల్లో కూర్చున్న వారిపై 307 కేసులు నమోదు చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడారని నిర్మల్‌లోని బావులవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించిన వారిపై కేసులు తప్పవని భయభ్రాంతులకు గురిచేశారు. ఏంచేసినా ప్రభుత్వం తిరిగి తమపైనే కేసులు పెడుతున్నదని నాలుగు గ్రామాల రైతులు, ప్రజలు మంగళవారం ఉదయం నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు రాస్తారోకో చేశారు. చర్చలు జరిపేందుకు వచ్చిన ఆర్డీవో రత్న కళ్యాణిని నిర్బంధించారు. దీంతో దిలావర్‌పూర్ ఆందోళన మరో లగచర్లను తలపించింది. ఏడాది కాలంగా ప్రశాంతంగా సాగిన పోరాటం ఒక్కసారిగా తీవ్రరూపం దాల్చింది. ప్రజలు ఆందోళన విరమించే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం దిగివచ్చింది. కలెక్టర్ అభిలాష అభినవ్ ఫ్యాక్టరీ పనులను నిలిపివేస్తున్నట్టు ప్రకటన విడుదల చేశారు. దీంతో తాత్కాలికంగా నిరసనను విరమిస్తున్నట్టు ప్రజలు తెలిపారు. టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఎస్పీ జానకీ షర్మిలను జాతీయ రహదారి నుంచి దిలావర్‌పూర్ గ్రామంలోనికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కతో ఆయా గ్రామాల ప్రజలతో ఫోన్‌లో మాట్లాడించారు.

రైతుల ఆందోళన నేపథ్యంలో నిర్మల్ జిల్లాలోని దిలావర్‌పూర్ గ్రామంలో పోలీసుల బందోబస్తు

అట్టుడికిన దిలావర్‌పూర్

- ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కొనసాగిన ఆందోళనలు
- గ్రామాల్లో ప్రజల నిర్బంధం.. రాస్తారోకో చేసిన వారి అరెస్టు
- మందు డబ్బాలతో వచ్చిన మహిళలు
- పోలీస్‌స్టేషన్ వద్ద బైఠాయింపు
- పోలీసులను పరుగులు పెట్టించిన జనాలు.. ఎట్టకేలకు దిగివచ్చిన ప్రభుత్వం

దిలావర్‌పూర్‌లో సంబురాలు చేసుకుంటున్న ప్రజలు

నిర్మల్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా నాలుగు గ్రామాల ప్రజలు చేపట్టిన ఆందోళనతో నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం అట్టుడుకుంది. దిలావర్‌పూర్, గుండంపెల్లి, బన్సపెల్లి, సముందర్‌పెల్లి గ్రామాలకు చెందిన ప్రజలు మంగళవారం ఉదయం నుంచి రాత్రి 12 గంటల వరకు రాస్తారోకో చేశారు. నిర్మల్-భైంసా ప్రధాన రహదారిపై బైఠాయించి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తేనే ఆందోళన విరమిస్తామంటూ పట్టుబట్టారు. అక్కడే వంటావార్పు చేసుకుని సామూహిక భోజనాలు చేశారు. ఈ క్రమంలో చర్చల కోసం వచ్చిన ఆర్డీవో రత్న కల్యాణిని ఆందోళనకారులు దాదాపు నాలుగు గంటల పాటు నిర్బంధించారు. ఆమెకు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో భారీ బందోబస్తు మధ్య పోలీసులు నిర్మల్‌కు తీసుకెళ్లారు. పోలీసులు ఆర్డీవోను తీసుకెళ్లారన్న ఆగ్రహంతో ప్రజలు ఆర్డీవో వాహనాన్ని ధ్వంసం చేశారు. కారు అద్దాలు పగలగొట్టి కారును రోడ్డుపై పడేశారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకున్నాయి. పోలీసులు లాఠీచార్జి చేసి నిరసనకారులను చెదరగొట్టారు. రెండోరోజు బుధవారం కూడా గ్రామాల ప్రజలు ఆందోళన చేస్తారని తెలిసిన పోలీసులు గ్రామాలకు వెళ్లి.. మంగళవారం ధర్నాలో పాల్గొన్న కొందరిని అరెస్టు చేశారు. దీంతో భారీ సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చారు. పోలీసులను, వారి వాహనాలను వెంబడిస్తూ రాళ్లతో దాడులకు దిగారు. చేసేది లేక పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు

ఆందోళనకారులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన మహిళలు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. పురుగుల మందు డబ్బాలు చేతిలో పట్టుకున్న మహిళలు.. స్థానిక ఎమ్మెల్యేతోపాటు కలెక్టర్ కూడా వచ్చే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించారు. విషయం తెలుసుకున్న గుండంపెల్లి, సముందర్‌పెల్లి, బన్సపెల్లి గ్రామాల ప్రజలు, మహిళలు, యువత పెద్దఎత్తున దిలావర్‌పూర్‌కు తరలివచ్చారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా.. నిర్మల్-భైంసా ప్రధాన రహదారిపై ధర్నాకు కూర్చున్నారు. దీంతో పోలీసులు నిర్మల్ నుంచి దిలావర్‌పూర్‌కు వెళ్లే మార్గం, భైంసా నుంచి దిలావర్‌పూర్ వచ్చే రోడ్డుపై భారీగా మోహరించారు. ధర్నా జరుగుతున్న దిలావర్‌పూర్‌కు వాహనాలు వెళ్లకుండా దారి మళ్లించారు. కాగా.. భారీ వాహనాలు వెళ్లే అవకాశం లేకపోవడంతో రోడ్లకు ఇరువైపులా కిలోమీటర్ల కొద్దీ నిలిచిపోయాయి.

ప్రభుత్వ కార్యాలయాలకు తాళాలు

మహిళలు, గ్రామస్తులు ఒక్కసారిగా రోడ్డు మీద బైఠాయించడంతో దిలావర్‌పూర్ పోలీస్‌స్టేషన్‌తోపాటు ఆ ప్రాంగణంలోనే ఉన్న ఎంఆర్‌వో, ఎంపీడీవో కార్యాలయాలకు అధికారులు తాళాలు వేశారు. రైతులు రోడ్ల మీద ఉన్నంత సేపు మధ్యాహ్నం రెండు గంటల దాకా కార్యాలయాలకు తాళాలు వేసే ఉన్నాయి. ఇంతలో ఆందోళనకారులు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తారన్న వదంతులు వ్యాపించాయి. దీంతో కలెక్టరేట్ కార్యాలయంలో పని చేసే వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తాళాలు వేసుకొని బయటికి వెళ్లిపోయారు.

పోరాటానికి బీఆర్ఎస్ అండ..

ఇథనాల్ ఫ్యాక్టరీపై పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ ముందు నుంచి అండగా నిలిచింది. స్థానిక గ్రామాల యువకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీఆర్ఎస్ సంఘీభావం తెలిపింది. ఇటీవల నిర్మల్ వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న అఖిలపక్ష సభ్యులతో మాట్లాడారు. వారి పోరాటానికి తమ మద్దతు ఉంటుందని భరోసా కల్పించారు. దిలావర్‌పూర్‌లో మంగళవారం ఉద్రిక్త పరిస్థితుల నెలకున్న విషయం తెలుసుకున్న కేటీఆర్ బుధవారం స్థానిక బీఆర్ఎస్ నాయకుడు రాంకిషన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల అరెస్టులపై నిరసన తెలపాలని, పోరాటానికి మద్దతుగా నిలవాలని ఆదేశించారు.

పురుగు మందు డబ్బాతో మహిళ నిరసన

నిర్మల్ ఘటనపై విచారణ జరిపించండి

నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో ఆర్డీవో పట్ల ఆందోళనకారులు వ్యవహరించిన తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

మా పోరాటం ఫలించింది

సంవత్సరకాలంగా మేము